www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 30 నవంబర్ 2023 5 కాకినాడ

సత్యదేవునికి రూ.1.61కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి హుండీల ఆదాయం రూ1,81,26,154 లభించింది. బుధవారం కొండపైన దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్, ఛైర్మన్ రాజా ఐవి రోహిత్ సమక్షంలో దేవస్థానం అధికారులు 29 రోజుల్లో వివిధ హుండీల్లో యాత్రికులు వేసిన విరాళాలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతోపాటుగా 42 గ్రాములు బంగారం, 976 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు వచ్చినట్లు అకౌంట్స్ విభాగం పర్యవేక్షణ అధికారి అనకాపల్లి ప్రసాద్ 'ప్రజాశక్తి'కి వివరించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, వివిధ విభాగాల ఎఇఒలు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులు, వ్రత పురోహితులు, సేవకులు పాల్గొన్నారు.

జీవనోపాధికి ఎసరు..!

▸ జిఒ 217తో మనుగడ ప్రశ్నార్థకం ▸ వ్యతిరేకిస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మత్స్యకారుల సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం విస్మరిస్తుంది. వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. పలు పథకాలు అందుబాటులో ఉన్నా అక్కరకు రాకుండా చేస్తోంది. వీటికితోడు వారి జీవనోపాధికి ఎసరు పెట్టేందుకు సిద్ధమౌతుంది. మత్స్యకారుల మనుగడనే ప్రశ్నార్థకం చేసే జిఒ నెంబర్ 217ను అమలుకు సిద్ధమైంది. ఏకపక్షంగా వ్యవహరించి ఈ జిఒను అమలు చేస్తే సహించేది లేదని మత్స్యకార సంఘాల హెచ్చరిస్తున్నాయి.

ఉనికికే ప్రమాదం

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి తదితర 13 మండలాల్లో 144 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. కోస్తా తీర ప్రాంతంలో 3.55 లక్షల జనాభా నివసిస్తున్నారు. చేపల వేట ద్వారా సుమారు 70 వేల కుటుంబాలు ఉపాధిని పొందుతున్నాయి. చెరువులు, జలాశయాలు, సరస్సులు, నీటిపారుదల కాలువలు, చిత్తడి నేలలు, మురుగు కాలువల్లో మత్స్య సంపద పెంపకానికి, అమ్మకానికి మత్స్యకార సంఘాలకు ప్రాధాన్యం ఇస్తూ మార్గదర్శకాలున్నాయి. మత్స్యకార సంఘాలు లేకపోయినా, లీజుకు ముందుకు రాకపోయినా తర్వాత ప్రాధాన్యం స్థానిక గ్రామ పంచాయతీకే ఉంటుంది. అయితే ప్రస్తుతం ఇది కాకుండా బహిరంగ వేలం నిర్వహించేలా జిఒ నెంబర్ 217ను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం వచ్చే ఆదాయంలో పంచాయతీకి 10 శాతం, మత్స్యశాఖకు 20, జలవనరుల శాఖకు 40 శాతం కేటాయిస్తారు. 30 శాతం ఆదాయాన్ని లేదా సంఘంలోని సభ్యులకు సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున ఇవ్వనున్నారు.

ఈ జిఒ అమలైతే మత్స్యకారుల ఉనికి, ఉపాధి ప్రమాదంలో పడనుంది. ఏళ్ల తరబడి మత్స్యకార సంఘాలను ఆదుకుంటున్న నీటి వనరులకు బహిరంగ వేలం నిర్వహించి, దానిద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ, జలవనరులు, మత్స్యశాఖ సంఘాలకు వాటాల పద్ధతిని ప్రవేశపెట్టడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లనుంది. మత్స్యకార సంఘాల్లో ఎస్సి, ఎస్టి, బిసిలే ఎక్కువగా ఉన్నారు. వీరంతా బహిరంగ వేలంలో పోటీపడలేరు. దీనివల్ల బడా బాబులు, కార్పొరేట్ సంస్థలే చేజిక్కించుకునే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల మత్స్యవేటపై ఆధారపడిన వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది..

మత్స్యకారుల సమస్యలపై పోరాటాలు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు. వేటపై లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తుండగా కొందరికే పథకాలు వర్తిస్తున్నాయి. డీజిల్ రాయితీ అందరికీ అందడం లేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. జీవో నెంబర్ 217ను తీసుకువచ్చిన సర్కారు దానిని అమలు చేయాలని చూస్తే ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తాం.

- చెక్క రమణి, జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యురాలు, ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్

మత్స్యకారుల ఉనికిని దెబ్బతీయొద్దు

స్థానిక చేపల చెరువులోని చేపలను పట్టుకునే హక్కు అక్కడి మత్స్యకారులకే ఉండాలి. అలా కాకుండా పెద్దల చేతుల్లో పెట్టేలా 217 జిఒను తీసుకురావడం సరైయింది కాదు. మా ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల పడవలకు డీజిల్ పై రూ.6 రాయితీ ఇచ్చాము. వైసిపి ప్రభుత్వంలో సవాలక్ష ఆంక్షలు పెట్టిన మత్స్యకారుల వృత్తినే దెబ్బతీస్తున్నారు.

- వనమాడి కొండబాబు, మాజీ ఎంఎల్ఎ, కాకినాడ అర్బన్

నండూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

'నండూరి' స్ఫూర్తితో...
ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం అవుదాం

ప్రజాశక్తి - కాకినాడ

కార్మికోద్యమ నేత, బహుముఖ ప్రజ్ఞాశాలి నండూరి ప్రసాదరావు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సీనియర్ నేతలు దువ్వా శేషబాబ్జి, పిలుపునిచ్చారు. నండూరి ప్రసాదరావు 22వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య భవన్‌లో జరిగింది. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముఖాసా జమీందారీ కుటుంబంలో జన్మించిన నండూరి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారని తెలిపారు. అనేక అంశాలపై లోతైన అవగాహన కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపును పొందారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ తొలి పూర్తికాలం కార్యకర్తగా చరిత్రలో నిలిచారని తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాలకు నాయకత్వం వహించడమే కాకుండా సిఐటియు ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలో కార్మికోద్యమ నిర్మాణానికి కృషి చేశారని కొనియాడారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడుగా, రాజ్యసభ సభ్యుడుగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారని, అత్యంత నిరాడంబరంగా జీవించారన్నారు. మతోన్మాదం వెర్రితలలు వేస్తున్న నేటి తరుణంలో నండూరి వంటి మహనీయుల స్ఫూర్తితో నేటితరం సమాజ అభ్యున్నతికి, మత ఉన్మాదులను తరిమి కొట్టేందుకు జరిగే ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నండూరితో ఉన్న అనుబంధాన్ని కె.సత్తిరాజు, వి. సుబ్బరాజు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.వీరబాబు, దుంపల ప్రసాద్, మలక వెంకట రమణ, రాణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దండతో స్వాగతానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఇసుక దండను తయారు చేస్తున్న కార్యకర్తలు

యువగళం పాదయాత్రలో వస్తున్న నారా లోకేష్‌కు మండలంలోని లంక గ్రామాలకు చెందిన ఇసుక కార్మికులు ఇసుక దండతో స్వాగతం పలకనున్నారు. సిఎంగా జగన్ పాలన చేపట్టి ఇసుకను బంగారం కంటే ప్రియంగా మార్చారని, సాధారణ ప్రజలు గృహ నిర్మాణాలకు సైతం ఇసుక లభించని స్థితికి తీసుకొచ్చారని, కార్మికుల కష్టాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఇసుక దండతో స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేసినట్టు టిడిపి మండల 10వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోపూరి వెంకటేశ్వరరావు తెలిపారు. సుంకరపాలెం జంక్షన్లో ఇసుక దండతో ఆయనకు స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

భవిష్యత్‌ను నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలు

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులు మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కాకినాడ అపోలో హస్పటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పి.చటర్జీ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం 'మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం- అనర్థాలు' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ చటర్జీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా విద్యపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చిట్టూరి రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై యువత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుందని అన్నారు. వీటి పట్ల విద్యార్థులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి పి. వేణుగోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ దాసరి శ్రావణి పాల్గొన్నారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న చటర్జీ

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆలోచనలను రేకెత్తించేలా సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తించేలా ఆదిత్య డిగ్రీ, పిజీ కళాశాలలో 5వ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం అయ్యిందని కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అన్నారు. ఆదిత్య కళాశాల మైదానంలో బుధవారం సై-లాండ్ -2023 కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అభ్యసించినప్పుడే పరిపూర్ణత చేకూరుతుందన్నారు. విద్యార్థులు పరిశోధకులుగా ఎదగాలని అందుకు ఈ విధమైన సైన్స్ ఎగ్జిబిషన్స్ ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు రూపొందించిన నూతన ప్రయోగాలు తక్కువ ఖర్చుతో సమాజహితంగా ఉన్నాయన్నారు. రెండు రోజులు జరిగే ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను వివిధ కళాశాలల విద్యార్థులు సందర్శిస్తారనిన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను పిఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి.తిరుపాణ్యం ప్రారంభించారు. కిఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందు ఉండడం అభినందనీయమని అన్నారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి సైన్స్ ఎగ్జిబిషన్ "సై-లాండ్" ను నిర్వహించిన సైన్స్ విభాగాల అధ్యాపకులను అభినందించారు

టిడిపి, జనసేన కుటమి గెలుపు అవసరం

జగ్గంపేట రూరల్ : రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల కూటమి విజయం సాధించడం రాష్ట్రానికి చారిత్రాత్మక అవసరమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జీను మణిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం అన్నారు. స్థానిక మర్రిమొక్క వీధిలో బుధవారం 'బాబు ష్యూరిటి - భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాంగా ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జగ్గంపేట నియోజకవర్గం నుంచి జ్యోతుల నెహ్రూ గెలవడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాండ్రంగి రాంబాబు, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, దాపర్తి సీతారామయ్య, వైభోగుల కొండబాబు యాదవ్, నాండ్ల చిరంజీవి, పోలినాటి ధర్మానందకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందర్నీ మోసం చేసింది

▸ బహిరంగ సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

▸ ముమ్మిడివరం నియోజకవర్గంలో సాగిన యువగళం యాత్ర

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని టిటిఆర్ నగర్ నుంచి బుధవారం యువగళం ప్రారంభమైంది. తొలుత నూతనంగా నిర్మించిన టిడిపి కార్యాలయాన్ని లోకేష్ ప్రారంభించారు. అనంతరం పెద్ద వంతెన వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అవినీతి మయమైన వైసిపి ప్రభుత్వం మరో మూడు నెలల్లో మాడి మసై పోవడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ చంద్రబాబుకి అవినీతి మరక అంటించాలని ప్రయత్నించి భంగపడ్డారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చివరికి న్యాయవాదుల పట్లా జగన్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. జగన్‌కి పేదవాళ్లు మంచి ఇంట్లో ఉండటం ఇష్టం ఉండదన్నారు. అందుకే టిడిపి కట్టిన టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. ఒక పక్క బటన్‌లు నొక్కుతూ మరో పక్క పేదల బతుకులను రోడ్లపైకి లాగుతున్నాడని విమర్శించారు. రాబోయే రోజుల్లో పీల్చే గాలిపైనా పన్నులు వేస్తాడని ఎద్దేవా చేశారు. 100 సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన మొదటి ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేశాడన్నారు. అభయహస్తం డబ్బులు రూ.2,500 కోట్లు దొచేశాడన్నారు. జాబ్ క్యాలెండర్‌ను అటకెక్కించాడని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అన్ని ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని, జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకోకపోగా ఇప్పుడు మోటార్లకు మీటర్లు పెడుతున్నారన్నారు. అవి రైతులకు ఉరితాళ్లు అన్నారు. పోలీసులకు సరెండర్స్, టిఎ, డిఎలు సైతం ఇవ్వట్లేదన్నారు. ఆఖరికి జిపిఎఫ్ డబ్బులు కూడా లేపేశారన్నారు. ఎంఎల్ఎ సతీష్ కుమార్ ముమ్మిడివరాన్ని అవినీతికి అడ్డాగా మార్చేశారన్నారు. ఆయన కలెక్షన్ కుమార్‌గా మారారన్నారు. మత్స్యకారులకు ఇచ్చే నష్టపరిహారంలోనూఆయన వాటాలు వసూలు చేస్తున్నారన్నారు. మత్సకారులకు కేటాయించిన డీజిల్ దారి మళ్లించేస్తూ పెద్దఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. యానాం నుంచి లిక్కర్ తెచ్చి ముమ్మిడివరంలో అమ్మేస్తున్నారన్నారు. ఈ నాలుగున్నర ఏళ్లలో ఎంఎల్ఎ కలెక్షన్ కుమార్ అక్రమార్జన రూ.400 కోట్ల పైమాటేనన్నారు. ఇది వైసిపి నాయకులు, కార్యర్తలే చెబుతున్న మాట అన్నారు. ఎదుర్లంక వద్ద రూ.79 కోట్లుతో గ్రోయిన్ల నిర్మాణానికి 2019లో శంకుస్థాపన చేశారు. అది శిలాఫలకానికే పరిమితమైందన్నారు. 2022 మేలో ఐ. పోలవరం మండలానికి రక్షణ వలయంగా ఉన్న 22 కిలోమీటర్లు ఏటిగట్టు ఆధునీకీకరణకు హామీ ఇచ్చి, తర్వాత పట్టించుకోలేదున్నారు. పల్లంకుర్రు-మూలపొలం వంతెన, గోగుల్లంక వంతెన, ముమ్మిడివరం-కాట్రేనికోన రహదారి నిర్మాణాలు శిలాఫలకాలకే పరిమితమయ్యాయన్నారు. రివిట్మెంట్ నిర్మాణాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. టిడిపి హయాంలో అప్పటి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు రూ.1800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం టిడిపి ప్రభుత్వం రూ.110 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. వైసిపి ప్రభుత్వం దాన్ని నిలిపేసిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడు పెరిగిపోయాయన్నారు. డాక్టర్ సుధాకర్ దగ్గర నుండి కొవ్వూరులో మహేంద్ర వరకూ జగన్ పాలనలో దళితులు సమిధలయ్యారన్నారు. అనంతరం ఆయన మహిళలు, యువత, దళితులతో సమావేశాలను నిర్వహించారు. ఆయన వెంట టిడిపి నాయకులు హరీష్‌మాథూర్, దాట్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వినతులను పరిశీలిస్తున్న లోకేష్

టిడిపి నాయకులతో సెల్ఫీ దిగుతున్న లోకేష్

కార్టూ'నిజం'



బాధిత కుటుంబానికి సాయం

పెద్దాపురం : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పాత్రికేయుడు విల్సన్ రాయ్ కుటుం బానికి సామర్లకోట, పెద్దాపురం విలేకరుల బృందం రూ.50 వేలు నగదు, నిత్యావసర సరుకులు బుధవారం అందించింది. పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ రాయ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎస్‌పిని ఆశ్రయించిన నూతన వధూవరులు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రేమ వివాహం చేసుకుని తమకు రక్షణ కల్పించాలని నూతన వధూవరులు బుధవారం జిల్లా ఎస్‌పి పి.సతీష్ కుమార్‌ను ఆశ్రయించారు. స్థానిక జగన్నాధపురం ముత్తా నగర్‌కు చెందిన ఓలేటి దివ్య(19), సంగాని మణికంఠ (23) కొంతకాలంగా ప్రేమించుకున్నారు. పెళ్లికి పెద్దలు అంగీకరించక పోవడంతో దేవస్థానంలో వివాహం చేసుకున్నట్లు తెలిపారు. పెద్దల నుంచి రక్షణ కల్పించాలని వారు ఎస్‌పి ఆశ్రయించారు. రక్షణ కల్పించేందుకు ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌కు వారిని తరలించారు.

సొమ్మును రికవరీ చేస్తాం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మీడియాతో మాట్లాడుతున్న పీడీ వెంకటలక్ష్మి

సచివాలయం నిర్మాణానికి అవసరమైన సిమ్మెంట్‌ను కొనుగోలు చేసేందుకు డ్రా చేసిన సొమ్మును తిరిగి రికవరీ చేస్తామని ఉపాధి హామీ పథకం పిడి అడపా వెంకటలక్ష్మి తెలిపారు. జగ్గంపేట మండలంలో 2022- 23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం స్థానిక ఎంపిపి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పిఆర్ ద్వారా మండలంలోని నరేంద్రపట్నం సచివాలయం భవన నిర్మాణానికి రూ.2.42 లక్షల విలువ చేసే సిమ్మెంట్‌ను డ్రా చేశారని, అయితే అక్కడ సంబంధిత భవనం నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. ఆ సొమ్మును సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తామన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించి, గుర్తించిన అవకతవకల విషయాలను ప్రజావేధిక దృష్టికి తీఉకొచ్చినట్లు తెలిపారు. గత 15 రోజులుగా సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో తనిఖీలు నిర్వహిం చారన్నారు. వర్షాలు లేకపోవడంతో ఉపాధి హామీ ద్వారా నాటిన మొక్కలు చాలా పాడవడం జరిగిందన్నారు. వాటి స్థానంలో మొక్కలు నాటి సదుపాయం కల్పించాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశాలు జారీ చేశామన్నారు. కొన్ని గ్రామాల్లో మేట్లు పని దినాలు సరిగ్గా నమోదు చేయకపోవడంతో కూలీలకు వేతనాలు పడలేదని గుర్తించామన్నారు. ఈ పనుల్లో రూ.74,662లను రికవరికీ ఆదేశించామన్నారు. ఈ ఏడాది మొక్కలు పెంపకంపైనే దృష్టి సారించడం జరిగిందని అమె తెలిపారు. ఈ సమావేశంలో అంబుడ్స్‌మెన్ జ్యోతి, ఎంపిడిఒ వసంత్ కుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎన్.శ్రీనివాసులు అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బుధవారం పెన్షనర్ల సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎమ్‌వి.వీరభద్ర స్వామి, అప్పారావు, రాంబాబు, యుఎస్ఎన్ రెడ్డి, తదితరులు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సమస్యలపై త్వరలోనే రాష్ట్ర ట్రెజరీ అధికారులకు నివేదికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతినెల పెన్షనర్ల సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెన్షనర్లకు సంవత్సర ఆదాయం రూ.7.50 లక్షల దాటిన 1700 మందికి ఈనెల పెన్షన్ నుంచి ఇన్కమ్ టాక్స్ తగ్గించడం జరుగిందన్నారు. ఎవరైనా పాత రెజ్యూమ్‌లో రూ.1.50 లక్షలకు సేవింగ్స్ వివరాలు ఉంటే డిసెంబర్ 15వ తేదీలోగా అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. 2024-25 సంవత్సరానికి ఇన్కమ్ టాక్స్‌కు సంబంధించి ఏప్రిల్ 2024 నుంచి10 సమాన వాయిదాలలో తగ్గించుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సబ్ ట్రెజరీ అధికారి రమా సుందరి, ట్రెజరీ సంఘం నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.భాస్కరరావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానమే ప్రాణదానం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రక్తదానంతో మరొక ప్రాణాన్ని కాపాడవచ్చుని, రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రగతి మహిళా డిగ్రీ కళాశాల మరియు రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎజిఎం సాధినేని అనిల్‌బాబుతో కలిసి ప్రారంభించారు. విద్యా సంస్థల డైరెక్టర్ నూతలపాటి హిమబిందు, ప్రగతి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానం ప్రాధాన్యతను గుర్తించి రక్త దాన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. యువత అంతా రక్తదానం పైన అవగాహన కలిగి రక్తాన్ని దానం చేయాలని పిలుపునిచ్చారు..హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ ఆఫీసర్ జి.శ్రీను రక్తదానం చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ శిబిరంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నరేష్, బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ కెఎస్ఆర్‌కె చౌదరి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ టి.సత్యనారాయణ, గంగాధరుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వర్చేస్వరి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి-బిక్కవోలు

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు కెనాల్ రోడ్‌లో బుధవారం బోల్తా పడింది. పిఠాపురం నుంచి 170 ధాన్యం బస్తాలతో బిక్కవోలు శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లుకు వెళ్తున్న ట్రాక్టర్ బిక్కవోలు దాటిన తర్వాత సీతమ్మ చెరువు వద్ద బోల్తా పడింది. కేవలం ట్రక్కు మాత్రే బోల్తా పడటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అనపర్తి నుండి బిక్కవోలు వరకు కెనాల్ రోడ్డు మీద పెద్ద పెద్ద గుంతలు పడడం వల్ల తరచూ ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని,ఈ రోడ్డును అభివద్ధి చేయాలని వాహనదారులు కోరుచున్నారు.

సమన్వయంతో నేరాలను నియంత్రించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నేర నియంత్రణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ సూచించారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో పోలీసుల పనితీరు పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సత్వర చర్యలు తీసుకునేలా పోలీసు శాఖ సిబ్బందిని సమన్వయం చేసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదు దారుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి ప్రజలకు సత్వర

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి అశోక్‌కుమార్

న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నేరాల నియంత్రణలో భాగంగా గంజాయి క్రయవిక్రయాలు, తరలింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి గంజాయి వినియోగాన్ని అదుపు చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 2022 వార్షిక సంవత్సరంలో 20 వేల 900 కేజీల గంజాయిని సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2023కి సంబంధించి ఏలూరు రేంజ్ డీఐజీ పరిధిలో కేవలం 9,500 కేజీల గంజాయిని సీజ్ చేసి 270 కేసులు నమోదు చేసి 1272 ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. గంజాయి విక్రయాలకు సంబంధించి స్థానిక కార్యకలాపాలపై నిఘా పెంచడంతో మంచి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, డిఎస్‌పి మురళీకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఘనంగా పిరమిడ్ 3వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక యానాం బీచ్ రోడ్‌లోని రామకృష్ణ పరమహంస పిరమిడ్ మూడోవ వార్షికో త్సవాన్ని అన్యం రామకష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున మెడిటేషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు అన్యం రామకష్ణ తెలిపారు.

పలువురికి అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

యానాం : యానాం నియోజకవర్గంలో వివిధ శాఖలలో యుడిసిలుగా పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి లభించింది. పుదుచ్చేరి వ్యాప్తంగా పలువురికి ప్రమోషన్లు కల్పించగా వారిలో యానానికి సంబంధించి ఆరుగురు ఉన్నారు.త్వరలో సంబంధిత శాఖలను వారికి కేటాయించనున్నారు.

ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక కందదొడ్డి మాచరమ్మ ఆలయం వద్ద బుధవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి రాష్ట్ర కార్యదరి ఆవాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. శ్రీ సాయిదుర్గ భవాని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు ఆహ్వానం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ అధికారి జి.సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిర్లంపూడి మండలం జగపతి నగరం గ్రామ పరిధిలో ఉన్న అంగాన్‌వాడి సెంటర్ 9లో ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 7 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పేదరికం నిర్మూలించే దిశగా అభివృద్ధి

ప్రజాశక్తి - కాకినాడ

పేదరికాన్ని నిర్మూలించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తుందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడలో ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో రూ.14.76 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్‌ను సిఎం జగన్ వర్చువల్ విధానం ద్వారా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో కాకినాడలో రూ.14.76 కోట్లతో నూతన ప్రింటింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడి భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్లస్టర్‌లో 250 చిన్న తరహా, సూక్ష్మస్థాయి ప్రింటింగ్ యూనిట్లు ద్వారా

ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్

వెయ్యి మందికి ప్రత్యక్షంగాను, ఐదువేల మంది నిరుద్యోగులకు, స్థానికులకు, మహిళలకు పరోక్షంగాను ఉపాధి పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రీ పద్మశ్రీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, పరిశ్రమల శాఖ జిఎంటి.మురళి, ఎపిఐఐసి జెడ్ఎం మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

నిరాహార దీక్షలో కూర్చొన్న నాయకులు

మండలంలోని గుర్రప్పాలెం దళితుల సీలింగ్ భూమి సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సీలింగ్ భూముల సమస్యలపై చేస్తున్న రిలే నిరాహారదీక్ష బుధవారం నాటికి 3వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా భూమి సమస్యపై రైతులు, కూలీలు దీక్ష చేస్తుంటే కనీసం స్పందించడం లేదన్నారు. మండలంలో ప్రభుత్వ యంత్రాంగం ఉన్నట్టా? లేనట్టా? అని ప్రశ్నించారు. ఇదే విధానంలో కొనసాగితే గుర్రపాలెం దళితుల సీలింగ్ భూముల సమస్యపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.రాజబాబు, కె.అంజిబాబు, కె.సతీష్, సురేష్, డి.సత్య, ఎ.సత్యనారాయణ, బోన్సాటి రమణ, చేదులూరి లక్ష్మి, విజ్జిన జ్ఞాన రత్నం తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ జెఎన్‌టియులో రెండు రోజులపాటు నిర్వహించిన క్రియా రాష్ట్రస్థాయి పోటీల్లో పెద్దాపురం రామారావుపేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో నిర్వహించిన గ్రూప్ డాన్స్, లఘు నాటికల పోటీలలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే కథా రచన, అంతర్జాలంలో అన్వేషణ, మ్యాప్ పాయింటింగ్, స్పెల్లింగ్స్(స్పెల్ బి), స్టోరీ టెల్లింగ్‌లలో పలు బహుమతులు గెలుచుకున్నారు. బుధవారం స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో విజేతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, అకాడమిక్ కల్చరల్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కరప

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందిస్తు న్నట్లు ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు అన్నారు. బుధవారం యండమూరులో వై నీడ్ జగన్ అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలకు సంబంధించి బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చింత ఈశ్వరరావు, బొమ్మితి వీర రాఘవులు, దరియా, మారెళ్ళ వెంకటరమణ, వడ్డపాటి గోపి, అప్పారావు, పంచాయతీ కార్యదర్శి పి వీరభద్రరావు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయం ఇఒగా సూర్యనారాయణ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పంచారామ క్షేత్రం సామర్లకోట శ్రీ కుమారారామ భీమేశ్వరాలయం ఇన్‌ఛార్జ్ కార్యనిర్వహణాధికారిగా కాండ్రకోట ఆలయ ఇఒగా విధులు నిర్వర్తిస్తున్న టి.వెంకట సూర్యనారాయణ బుధవారం ఆలయంలో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ సురేష్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఇఒ డి నాగమల్లేశ్వరరావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో, కార్తీక మాసోత్సవాలకు అంతరాయం కలగకుండా కమిషనర్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నట్టా ? లేనట్టా ?

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ టిపిఒ బదిలీ అయి మూడు నెలలు గడిచినా ఈనాటికి డిపిఒను నియమిం చకపోవడంతో మున్సిపాలిటీ ఆదాయానికి తీవ్ర స్థాయిలో గండి పడుతుందని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగ తాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కరరావు, ఆరేళ్ల వీర రాఘవలు మాట్లాడుతూ అనధికార లేఅవుట్లు పట్టణ పరిధిలో పెరిగిపోతున్నాయన్నారు. అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల మున్సిపాలిటీ తీవ్ర స్థాయిలో ఆదాయాన్ని కోల్పోతుం దన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ స్థితి నెలకొందన్నారు. పట్టణంలోని అన్ని

కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న కౌన్సిలర్

వార్డుల్లో దోమలు ఎక్కువగా పెరిగిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, ఆర్ఐ చంద్రశేఖర రావు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరు దొరబాబు అన్నారు. బుధవారం స్థానిక కబాడీ వీధిలో రూ.13 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మిలతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనా బీబీ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కౌన్సిలర్లు తాటికొండ వెంకటలక్ష్మి, నీలంశెట్టి అమ్మాజీ, సత్య భాస్కరరావు, విడదాసరి రాజా, ఆరేళ్ల వీర రాఘవ పాల్గొన్నారు.

రాష్ట్ర సైన్స్ కాంగ్రెస్‌కు కాకినాడ విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ పోటీలు గుంటూరు జిల్లా కెఎల్ యూనివర్సిటీలో బుధవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ పోటీలో జిల్లా నుంచి 7గురు విద్యార్థులు, గైడ్ టీచర్లు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కాకినాడ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ కె.వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి జి నాగమణి విద్యార్థులకు, గైడ్ టీచర్లకు అభినందనలు తెలిపారు.

ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు గ్రామ శివారు పోర కాపురస్తులు రేకాడి పెదకాసులయ్య గారి కుమారుడు నరసింహారావుకు చెందిన కందికుప్ప గ్రామం తాలూకు జిరాయితీ మెరక రి.స. నెం. 12రు, రి.స. నెం. 13రులలో య. 0.15 1/4ట్లు భూమికి సంబంధించిన లింకు దస్తావేజు నెం. 527/2017రు గల ఒరిజినల్ దస్తావేజులు తీసుకొని ది. 20-11-2023 సం॥రం తేదీన కందికుప్ప గ్రామం నుంచి కాకినాడ వెళుతున్న సమయంలో మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

రేకాడి నరసింహారావు
తండ్రి: రేకాడి పెద కాసులయ్య
పోర గ్రామం, పల్లంకుర్రు
కాట్రేనికోన మండలం
సెల్: 9640281264

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రక్తదానంతో మరొక ప్రాణాన్ని కాపాడవచ్చని, రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రగతి మహిళా డిగ్రీ కళాశాల మరియు రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎజిఎం సాధినేని అనిల్‌బాబుతో కలిసి ప్రారంభించారు. విద్యా సంస్థల డైరెక్టర్ నూతలపాటి హిమబిందు, ప్రగతి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్‌ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానం ప్రాధాన్యతను గుర్తించి రక్త దాన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. యువత అంతా రక్తదానం పైన అవగాహన కలిగి రక్తాన్ని దానం చేయాలని పిలుపునిచ్చారు..హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ ఆఫీసర్ జి.శ్రీను రక్తదానం చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ శిబిరంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నరేష్, బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ కెఎస్‌ఆర్‌కె చౌదరి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ టి.సత్యనారాయణ, గంగాధరుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వర్చేస్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

రైతాంగం ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక ఉత్పత్తులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి అన్నారు. జి.వేమవరంలో పొలంబడి క్షేత్ర దినోత్సవం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన పైరును పెంచే విధానం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం వరి చేనును పరిశీలించడం, వంటి సూచనలతో పాటు రైతును తన పొలం పనులలో శాస్త్రజ్ఞుడిగా చేసే విధానాలను ప్రశాంతి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యర్రంనీడి అప్పారావు, గండి రామాంజనేయులు, పితాని సుబ్రహ్మణ్యం, గండి చిన అప్పారావు, వెంకటరమణ, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పలువురు గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పొలంబడిలో మాట్లాడుతున్న ఎఒ ప్రశాంతి

యువగళం పాదయాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. కొండబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ రాష్ట్ర ప్రజలకు కొండంత ధైర్యాన్నిస్తూ కుప్పం నుంచి నారా లోకేష్ పాదయాత్రను చేపట్టారని తెలిపారు. పాదయాత్ర 1న జగన్నాధపురం బాలయోగి సెంటర్‌కు చేరుకుంటుందని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఎం. వీరు, జి.నారాయణరావు, టి.రమేష్, ఒమ్మి బాలాజీ, జి.సాయిబాబా, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అమలాపురం గౌరవ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 61/2022

బిట్వీన్:
మండిగ విజయలక్ష్మి -వాది
అండ్
చీకురుమిల్లి రాజ్యం మరియు వగైరా -ప్రతివాదులు

టు:
D-1: చీకురుమిల్లి రాజ్యం, భర్త: భూషణం, C/o. చీకురుమిల్లి వారి పేట, కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పైన చెప్పిన దావాలో 1వ ప్రతివాదికి శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినను తీసుకొనక త్రిప్పివేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం తెలియ చేయునది ఏమనగా, ది. **15-12-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తగు ఆక్షేపనలు తెలియచేయవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

చిల్లా నరసింహ గిరి
భూసారపు బ్రహ్మ యేసుబాబు
వాది తరుపు న్యాయవాదులు
అమలాపురం, సెల్: 9966956692

ప్రతి కుటుంబానికీ ఆరోగ్యశ్రీ కార్డు

ప్రజాశక్తి - కరప

ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు వర్తించేలా మండల మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్లో అప్లోడింగ్ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. స్థానికంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియపై మెడికల్ హెల్త్ సిబ్బందిని ఆయా గ్రామాలకు పంపించేందుకు డేటా తయారు చేశామని తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి వైద్య ఆరోగ్య సిబ్బందిని ఇంటింటికి పంపించడం జరుగుతుందన్నారు. కుటుంబాలలో ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించడం, వారికి కావలసిన వైద్య సహాయాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవడం, ఆరోగ్య రికార్డులను అప్లోడ్ చేసి భద్రపరచడం వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు.

వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న సల్మాన్‌రాజు

టిడిపిలో చేరిన కత్తిపూడి మాజీ సర్పంచ్

ప్రజాశక్తి - శంఖవరం

వైసిపికి చెందిన మాజీ సర్పంచ్ దువ్వాడ సల్మాన్ రాజు తన అనుచర ఘనంతో ప్రత్తిపాడు టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా సత్య ప్రభ ఆయనకు పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెన్న ఈశ్వరుడు, బద్ధి రామారావు, పర్వత సురేష్, సాధనాల లక్ష్మీ బాబు పాల్గొన్నారు.

పి హెచ్‌సి సబ్ సెంటర్లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు సిహెచ్‌సి సబ్ సెంటర్లో బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించినట్లు పిహెచ్సి వైద్యులు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. జగన్నాధపురం ఫైర్ నివారణ అధికారి ఏసుబాబు తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. సంఘటనా స్థలానికి కరప ఏఎస్ఐ ప్రసన్నకుమార్ సిబ్బందితో హుటాహుటీన చేరుకుని స్థానికుల సహకారంతో మంటలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టారు. పెనుగుదురు సచివాలయం సబ్ సెంటర్ పక్కనే ఉండటంతో ఆ మంటలు సచివాలయానికి చుట్టుముడతాయేమో అన్న ఆందోళన చెందారు. సబ్ సెంటర్లో ఉన్న రికార్డులు, కంప్యూటర్లు, టేబుల్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. నష్టం అంచనా పూర్తిస్థాయిలో వేయలేదని వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

సమావేశంలో నాయకుల సంఘీభావం

26న కాకినాడలో బహిరంగ సభ

ప్రజాశక్తి - కాకినాడ

బడుగు, బలహీన వర్గాల ఆశయాల కోసం వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 26న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు రాధా, రంగా రాయల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మంచాల సాయి సుధాకర్ నాయుడు, అధ్యక్షుడు గాదె బాలాజీలు తెలిపారు. స్థానికంగా బుధవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడుతూ కులాల ఐక్యత కోసం, సమాజ శ్రేయస్సు కోసం రంగా బడుగుల తరపున పనిచేశారన్నారు. నాడు ఆయన తన కులం కాకుండా ఇతర దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ఆశయాలు కోసం ఆశించిన రీతిలో పనిచేసి రంగా మన్ననలు పొందారన్నారు. ఆయన జైల్లో ఉండగా కాపునాడు అనే సంస్థను ప్రారంభించి కార్యక్రమాలు చేపట్టారని, ప్రస్తుతం ఆ పేరుతో కాకుండా రంగా నాడు అనే పేరుతో అందరికీ మేలు చేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామన్నారు. డిసెంబర్ 26న కాకినాడలో జరిగే కార్యక్రమానికి మంద కృష్ణ మాదిగ, ఆర్.కృష్ణయ్య, జాతీయ దళిత నాయకుడు రాజశేఖర్‌తోపాటు,ఇతర నాయకులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు బచ్చల కామేశ్వరరావు, వాదా ప్రసాద్ రావు, జానపాముల నాగబాబు, రాజారపు మహేష్, బొజ్జ ఐశ్వర్య, తుమ్మల శ్రీరామ్మూర్తి, సలాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోట జడ్‌పి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు వినియోగదారుల చట్టం 2019 పై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో తూనికలు కొలతల శాఖ సిఐ విఎస్.మోహన్, ఎసి సలీం, టిఎస్ఎన్.మూర్తి, నూకరాజు, కె.వీరభద్రరావు, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో జాస్తి వసంత్ దంపతులు

ఘనంగా కళ్యాణ మండపం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో వెంకటేశ్వర కాకతీయ కళ్యాణ మండ పం ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ దంపతుల చేతుల మీదుగా గణపతి హోమం నిర్వహించారు. సుంకవల్లి రాజు, గోరిజాల వెంకన్న దొర, గద్దె అబ్బున్న, ఉండవల్లి బుల్లియ్య, ఇతర పెద్దల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తోట నరసింహం, ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్, ఎంపిపి చలగళ్ల దొరబాబు, టిడిపి సీనియర్ నాయకులు కోర్పు లచ్చయ్య దొర, జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, జగ్గంపేట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE 2ND ADDL. SENIOR CIVIL JUDGE :: GUNTUR
E.P.No.272/2018 in O.S.No.443/2013
Between:
Damarla Vasantha Rao ...D.H.R.
AND
Komarapuri Gangachalam & Others ...J.D.R.'s

To,
J.D.R. No-1: Komarapuri Ganga Chalam, S/o. Appala Swamy, Special Grade Deputy Collector (Retired), Presently Working as Competent Authority Reliance Gas Transportation Ltd, Reliance Industries Ltd. Gadmoga R/o. Door No.8-13-8/2/1, Pratap Nagar, Kakinada, East Godavari Dt.
పై నెంబరు E.P.లో **1వ జె.డి.ఆర్.** అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా SALE నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది.11-12-2023 ఉ.గం. 10.30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేట్ ద్వారా గాని, హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 11-12-2023
జి.వి.రమణ, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9848231931

సామర్లకోట పురపాలక సంఘం
ఆర్.ఒ.సి. నెం. 562/2023-ఇ1 **తేది.29-11-2023**

షార్టు టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం పట్టణము నందు రూ. 1,00,000/-లు పైబడి జరుగు అభివృద్ధి పనులకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీ వారు పనుల నాణ్యతను పర్యవేక్షణ చేసి సర్టిఫికెట్ ఇచ్చుటకు షార్టు టెండర్లు కోరబడుచున్నవి.

1. టెండరు షెడ్యూలు కొరకు రుసుము చెల్లించుటకు ఆఖరు తేది : 04-12-2023
2. టెండరు ఇ.ఎమ్.డి. చెల్లించుటకు ఆఖరు తేది : 05-12-2023
3. టెండరు షెడ్యూలు జారీ చేయు తేది : 06-12-2023 (మధ్యాహ్నం గం॥ 12.00లకు)
4. టెండరు తెరువబడు తేది : 06-12-2023 (సాయంత్రం గం॥ 4.30లకు)

తదుపరి వివరముల కొరకు పురపాలక సంఘ కార్యాలయము నందు సమాచారం పొందవచ్చును.

సం/- **కమిషనరు,** సామర్లకోట పురపాలక సంఘం

ప్రకటన

నా క్లయింట్ దొమ్మేటి నాగేశ్వరరావు, S/o. లంకయ్య అనే తాతయ్య ముమ్మిడివరం గ్రామము, ముమ్మిడివరం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ కట్టా పళ్ళాళ్ళమ్మ గారి నుంచి ఈ దిగువ షెడ్యూలు ఆస్తి ది. 01-02-2022వ తేదీన దస్తావేజు నెంబర్ 474/2022 రీత్యా కొనుగోలు చేసినారు. సదరు ఆస్తిపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు గాని, క్లెయిములు గాని, హక్కులు గాని ఉన్న యెడల ఈక్రింది ఉదహరించిన లాయరు గారికి డాక్యుమెంట్లు ప్రూఫ్‌తో సహా ఈ ప్రకటన వెలువడిన 7 దినములలో అభ్యంతరములు లిఖితపూర్వకముగా అందజేయవలెను. లేని యెడల ఈ షెడ్యూలు ఆస్తిపై ఏవిధమయిన క్లెయిములు, అభ్యంతరములు లేవని తదుపరి చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు ఆస్తి వివరం: డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, (పూర్వపు తూర్పుగోదావరి జిల్లా), ముమ్మిడివరం రిజిష్ట్రీ, ముమ్మిడివరం మండలం, ముమ్మిడివరం గ్రామం నగర పంచాయతీ సర్వే నెంబర్ 1092-7లో విస్తీర్ణం 133.1 చదరపు గజములలో సమీప డోర్ నెంబర్ 12-48/ఎ లో స్థలం హద్దులు.
తూర్పు: కట్టా గన్నయ్య గారి వాటా స్థలము.
దక్షిణం: కాకి లక్ష్మయ్య గారి స్థలము.
పడమర: సిమెంటు రోడ్డు.
ఉత్తరం: ఉమ్మడి దారి మార్గము, మార్గము అవతల కట్టా గౌరమ్మ గారి స్థలము.

టి.శాంతి కమల
అడ్వకేట్, అమలాపురం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 7013665313